# అతివృష్టి

## పెద్దకథ

### శ్రీ టేకుమళ్ల కామేశ్వరరావు

ఆకాశాన్ని చూసి హడిలిపోతున్నారు పెళ్లివారు! పెళ్ళి ముహూర్తం వచ్చి శ్రావణమాసంలో పడింది. శ్రావణ భాద్రపదాలని పేరే ఉంది వర్షానికి. ఆరోజున పెద్ద విందు ఏర్పాటు చేసుకొన్నారు. పందిరి పెద్దదే కాని వర్షానికి అడ్డేమిటి! "ఏమిటో ముహూర్తబలం!" అంది పెళ్ళికొడుకుతల్లి. "మన అదృష్టమెలాగుందో!" అంది వియ్యపురాలు. "ఆ నాలుగు ఘడియలూ వర్షం ఎత్తిపెట్టినా బాగుండును!" అన్నారు అందరూ. పందిరిలో కూడా వడ్డించడం తప్పనిసరి అయింది. పంచల వెంబడి, వసారాలలోను ఎంతకని సర్దుతారు! భోజనాలు సగపడ అయేయి. కొత్త ఉరుములు, కొత్త కొత్త మెరుపులు కనబడ్డాయి. గబగబ మజ్జిగ వడ్డన అయింది. పందిరిమీద టప్పటప్ప మని మొదలు పెట్టింది. విస్తళ్లలో మజ్జిగ పల్చనయింది. ఎవళ్ళమట్టుకు వాళ్లు లేచిపోయి అక్కడా, అక్కడా తలదాచుకొన్నారు. ఇహ వానలు కురవనియ్యండి, చావనియ్యండి! మని కెందుకు? మనపని ఏదో రకంగా పూర్తిఅయింది. అన్నాడు పెళ్లికొడుకు తండ్రి. 'అహా?' అన్నారు దగ్గిర ఉన్న వాళ్ళు. "ఏదయినా మొత్తంమీద ఈ సంవత్సరం వర్షాలు అధికమని పంచాంగంలో రాసే ఉందిట!" అంది పెళ్ళికొడుకు తల్లి.

రెండువైపులా ఏవాళ్లు ఏమీ ఇబ్బంది లేకుండానే కాలక్షేపమయి పోయేయి.

తులసెమ్మ, అంటే పెళ్ళికొడుకు తల్లి, వంటచేస్తూంది. పక్కనే పీటమీద కూర్చున్నాడు ఆమె భర్తఅయిన సన్నిధిరావు.

"అమ్మాయిని దాని పినతల్లి నాలుగు రోజులపాటు తమఊళ్లో తమదగ్గిర అట్టే పెట్టుకొని పంపిస్తానంటూ పెళ్లినుంచి వెడుతూ తీసుకుపోయింది. ఇల్లు బోరుమంటూంది!" అందితులసెమ్మ.

"అలాగేమరి! పిల్లలు ఇంటిలో లేక పోతే?" అన్నాడు సన్నిధిరావు.

"కోడల్ని ఇంటికి తీసుకురావాలి!" అంది తులసెమ్మ, కళ్లు ఎగసనతోస్తూ.

"పెళ్లికాల మందే శ్రావణమాసంలో మొదటివారం జరిగిపోయింది గాదులే! తతిమ్మా వారాలలో నోముకోచుకొన్నా లెక్కకి రాదు కాదులే!" అన్నాడు సన్నిధిరావు.

"సరే! లెక్కకి రాకపోతే మట్టుకు, వేడుకకి చేసుకోకూడదా ఏమిటి!" అంది తులసెమ్మ.

"దానికేమంత అర్జంటు అని" అన్నాడు భర్త.

"మన ఇంటికి మనపిల్లని తెచ్చుకోడానికి తొందర అక్కరలేదేమిటి! లేకపోతే పుట్టింటిలోనే పడేసి అట్టేపెట్టండి! ఏదో సామెత చెప్పినట్లుగా ఉంది. రాకపోకలకి అడ్డులేకుండా పోతుందనేకాదూ పెళ్లిలోనే కార్యంకూడా జరిపేశాము. వాళ్లు మట్టుకు ఎంతకాల ముంచుకొంటారు, ఎదిగినపిల్లని!" అంది భార్య ఉపన్యాసధోరణిగా.

"సరే పంపమని ఉత్తరం రాస్తాను!" అన్నాడు సన్నిధిరావు.

సన్నిధిరావు రాజమహేంద్రవరంలో ప్లీడరుగుమాస్తా. ఏదో బ్రహ్మని తిమ్మి, తిమ్మిని బ్రహ్మిచేసి తంటాలు పడుతూంటాడు. అతనికంటె అతని భార్య తులసెమ్మ పేరు మోగిన మనిషి. "అల్బో! ఆవిడా!" అంటారు తెలిసిన పెద్దమనుష్యులందరూ. మరేంలేదు, నోరు పెద్దదిట!

తల్లిదండ్రులు సంభాషిస్తూన్నప్పుడు కొడుకైన చెన్నారావు ఇంటిలో లేడు. అతను బజారుపనిమీద వెళ్లాడు. అతను సన్నగా, ఎర్రగాఉంటాడు. అంటకత్తిర. చిన్నపిలక.

కోడలైన రామామణి పుట్టిల్లురాజోలు. ఆమె తండ్రిపేరు బలభద్రం. అతను వ్యవసాయదారుడు. పాడిపంటలకేమీ లోటు లేదు. అతనికి రామామణి ఒక్కర్తె సంతానం. అన్ని ప్రాణాలూ, ఆ అమ్మాయిమీద పెట్టుకొన్నారు తల్లిదండ్రులు.

సన్నిధిరావు రాసినఉత్తరం బలభద్రానికి చేరింది. అతను చదువుకొని "ఏమేవ్!" అంటూ అరిచాడు.

"ఎందుకు నాన్నా!" అంటూనే కూత్రె అయిన రామామణి వచ్చింది.

"నిన్ను కాదమ్మా! మీ అమ్మనిరమ్మను త్వరగా" అన్నాడు బలభద్రం.

"వచ్చే! వచ్చే!" అంటూ భార్యయైన బంగారమ్మ సావిటిలోకివచ్చి "ఏమిటి!" అని అడిగింది.

"ఇదిగో మీ వియ్యంకుడి దగ్గిరనుంచి వచ్చిన తాఖీదు!" అన్నాడుభర్త.

"నావియ్యంకుండే గాని మీ వియ్యంకుండు కాదేమిటి!" అంది భార్య.

"రెండు రోజులలో అక్కడికి తీసుకు వచ్చి దిగబెట్టాలిట! అర్జంటు!" అన్నాడు భర్త, ఉత్తరం వేళ్లమధ్య ఆడిస్తూ.

"అల్లుడు ఏమిపాటు పడుతున్నాడని ఇంటిదగ్గర! వచ్చి, రెండురోజులు ముచ్చటగా ఉండి, పిల్లని తనతో తీసుకు వెళ్ల రాదూ!" అంది భార్య.

"అలాగు పంపిస్తుందిలే మీ వియ్యపురాలు, అబ్బో! తాతలు దిగిరావాలి! మొదటిమాట వాళ్లకి మర్యాదలు చాల వద్దూ!" అన్నాడు బలభద్రం.

వారి ఇంటిదగ్గిర వారికి నిత్యమూ మర్యాదలు జరుగుతూనే ఉన్నాయి కమోసు!" అంది భార్య.

"నువ్వు చెప్పేది బాగానే ఉంది! ఎవరి ఇంటిదగ్గిర వారికి మన్నాపన లేమిటి! సభలో ఉన్నప్పుడే పూజ్యత! అల్లుడికి మూడురోజులే మర్యాద! ఇలాంటి శాస్త్రాలు కొల్లలుగా ఉన్నాయి" అన్నాడు భర్త.

"సరే! పంపించండి. మధ్యనినా అభ్యంతరమేమిటీ!" అంది భార్య.

కుమార్తెయైన రామామణి తల్లిదండ్రుల సంభాషణ శ్రద్ధగా వింటూంది.

"దిగబెట్టేవారు ఎవరు?" అన్నాడు బలభద్రం.

"ఎవరంటే?" అని బంగారమ్మ ప్రశ్నించింది.

"ఇంటి పనులన్నిటికీ ఎవరు పెద్దలో, వాళ్ళే తీసుకువెళ్ళి దిగబెట్టడానికి కూడా పెద్దలు!" అన్నాడు బలభద్రం.

"నేను వెళ్లలేను సుమండీ! లేనిపోని జట్టీలు? ఆ తులసెమ్మనోట్లో ఎవరునోరు పెడతారు?" అంది భార్య.

"చేసుకొన్నాక తప్పుతుందిటే!" అన్నాడు భర్త.

"తప్పించుకునే వాళ్లకి తప్పక ఏమవుతుంది! ఇప్పుడు వాళ్లకి చక్కగా తప్ప లేమా! ఒక్కకార్డు ముక్కతో సరి!" అంది బంగారమ్మ.

"కార్డు అంటావు కార్డు! ఇది టెలిగ్రాం ఇంకా ఆపైన ఏదేనా ఉంటే అదిగా కూడా భావించుకో! రూపాయిల నోటుకి కాగితం ముక్క విలువా చూస్తాం! ఇదీ అట్లాంటిదే" అన్నాడు బలభద్రం.

"వాళ్లది పైచెయ్యి, మనది కింది చెయ్యి!" అంది.

"కన్యధార పోస్తున్న క్షణంలో ఎవరి చెయ్యి పైదో కాస్త జ్ఞాపకం తెచ్చుకో!" అన్నాడు.

"కలలో బంగారు గిన్నెలతో తాగేదన్నట్టుగానే ఉంది!" అంది భార్య.

"పిల్లని ఇచ్చుకొన్న వాళ్లపని అంతగాక మరేమి!" అన్నాడు బలభద్రం.

"ఏమోబాబూ! నేను చెప్పలేను" అంది బంగారమ్మ.

"ఈ పొలంపనులన్నీ పొందుచేసుకొని. నన్ను వెళ్లిరమ్మంటే వెళ్లి వస్తాను!" అన్నాడు భర్త.

"ఏదో తీరుబాటు చేసుకోండి?"

"తీరుబాటు చేసుకోవడం వస్తే అంతా తీరుబాటే! మరితిరిగి పొలంవైపు చూడక్కర లేదు! అందుచేత నువ్వే ఒక్కమారు వెళ్లి వియ్యపురాలికేమేమి పిండివంటలు చేసి పెడతారో, ఏమేమి మర్యాదలు చేస్తారో, అవన్నీ పుచ్చుకొని, నాలుగురోజులైతే ఉంటావో, నాలుగువారాలే ఉంటావో, నీ ఇష్టం ఉండి—"

"వారాలు కూడాను. నేనే వెళితే పిల్లని దిగబెట్టి చక్కావస్తాను. నేను అక్కడ ఒక్కక్షణం ఉండను. మన మర్యాదమనం మొదటినుంచీ కాపాడుకోవాలి" అంది భార్య.

"సరే! ఎల్లుండి మంచిరోజుగా కనబడుతూంది పంచాంగంచూస్తే! అంతా సిద్ధం చేసుకోండి మరి" అని.

"ఎందుకైనా మంచిది ఉత్తరం ముక్క ఒకటి ఇప్పుడే పోస్టులో పడేస్తా" అంటూ బలభద్రం కార్డురాసి పోస్టులో పడవేశాడు.

సన్నిధిరావుకి ఉత్తరం అందింది. భార్యయైన తులసెమ్మతో "ఏమేవ్! కోడలు ఎల్లుండి బయలుదేరి వస్తుందిట!" అన్నాడు కొడుకైన చెన్నారావుకూడా దగ్గిరే ఉన్నాడు.

"వెంట ఎవరు వస్తున్నారు?" అని అడిగింది తులసెమ్మ.

"ఎవరేమిటి? మీ వియ్యపురాలు" అన్నాడు సన్నిధిరావు.

"సరే? బాగానే ఉంది! అన్నిటికీ ఆవిడే కాబోలు పెద్ద! మగపనులకీ, ఆడపనులకీ కూడా! ఇంటిలో ఆయన గారేమి పాటుపడుతున్నాడు. తాను వచ్చి దిగబెట్టి పోరాదూ!" అంది భార్య.

"ఏమో వాళ్లకేమి ఇబ్బందులున్నాయో, మనకేమి తెలుస్తుంది!" అన్నాడు సన్నిధిరావు.

"పిల్లకి పెళ్ళిచెయ్యడమే మొదటి ఇబ్బంది" అంది తులసెమ్మ.

"కోడలికి ఏమేమి మప్పుతుంటారో, ఏమిటో" అన్నాడు సన్నిధిరావు.

"మొక్కప్పుడు కాకపోతే మానప్పుడు వంగుతుందా ఏమిటి!" అంది భార్య.

చెన్నారావు తల్లిదండ్రుల సంభాషణ వింటూ గ్రహిస్తున్నాడు.

"మనకి పేరు ప్రతిష్ఠలు తెచ్చేదే అవుతుందో, రాలుగాయే అవుతుందో!" అన్నాడు సన్నిధిరావు.

"అయ్యగారు నెత్తిని ఎక్కించుకోకుండా ఉంటేసరి!" అని కొడుకువైపు చూసింది తల్లి.

కొడుకు అర్థం చేసుకొని ఊరుకొన్నాడు.

"మొదటినుంచి ఖాయిదాలో ఉంచితేనే మాట దక్కడం?" అన్నాడు తండ్రి కొడుక్కి కూడా సలహాగా.

"గీచిన గిరి దాటకూడదు మరి. ఇంతకీ మనం లొంగతీసు కోడంలోనే ఉంది... మెల్ల, మెల్ల, మెల్ల, మెల్ల అంటే మెడ ఎక్కి కూర్చోమంటున్నారు కమోసు అనుకొని మెడమీద ఎక్కగా కూర్చుంటుంది" అంది తులసెమ్మ.

వీధిగుమ్మంలో తపాలా మనిషి 'సా-ఆ-ఆ-ఆ-ర్" అని పిలవగా, చెన్నారావు వెళ్ళి ఉత్తరం అందుకొని లోపలికి వచ్చి "అమ్మాయి ఇవాళ సాయంత్రం వస్తుంది టేవ్!" అన్నాడు.

"బాగుంది!" అంది తల్లి.

"ఇంకేం! ఇటు కూతురు, అటు కోడలు వస్తూంటే మళ్లీ ఇల్లు కలకలలాడుతూంటుంది" అన్నాడు తండ్రి.

"పిల్లలేక ఇల్లు చిన్నబోయిందమ్మా!" అంది తల్లి. తర్వాత కోర్టుపనిమీద సన్నిధిరావు వెళ్లిపోయాడు. చెన్నారావు టైపు, షార్టుహాండు నేర్చుకొంటున్నాడు. అందుచేత అతడు ఇన్‌స్టిట్యూట్‌కి వెళ్లిపోయాడు.

తులసెమ్మ కూతురుపేరు సింగమ్మ. ఆ అమ్మాయికి పదిహేనేళ్లు ఉంటాయి. పెళ్ళికోసం సంబంధాలు వెదుకుతున్నారు. కాని ఇంకా ఎక్కడా కుదరలేదు. తులసెమ్మకూ తొరనో ఏమో మరి! ఆ అమ్మాయి అన్నివిధాల తల్లి పోలికే అని చెప్పుకొంటారు.

బలభద్రం భార్యని కూతురిని పడవ ఎక్కించాడు. చిటపట చినుకులు మొదలు పెట్టగా గొడుగు విప్పి ఇంటికి చేరుకొన్నాడు. హోరుమంటూ వర్షం కురిపించింది. రాత్రి పడవలో ప్రయాణికులు నానా ఇబ్బంది పడ్డారు పాపం. కళాసులసంగతి వేరే చెప్పనక్కరలేదు. జారుడు కాలవగట్టు మీద పడడం లేవడం!

వాకిటిలో బండిఆగగా చెన్నారావు ఇవతలకి వచ్చిచూసి "రాజోలు నుంచి వచ్చిందేవ్, మీ వియ్యపురాలు" అంటూ తల్లికి చెప్పాడు. "రాకేంచేస్తారు! నుండా! చెరువా!" అందితల్లి.

రామామణి గుమ్మంమెట్లు ఎక్కి గడప దగ్గరనిలుచుంది. తులసెమ్మ వీధిగుమ్మం దగ్గరకి వెళ్లి "కుడికాలు పెట్టి తల్లీ!" అంది.

రామామణి పమిటికొంగు పళ్లలో పట్టుకొంది.

తలఎత్తి చూసింది బంగారమ్మ.

మగవాళ్లు భోంచేసి వాళ్ల వాళ్ల పనుల మీద వెళ్లిపోయేరు. అమ్మలక్కలు వడ్డించుకొన్నారు. భోంచేస్తున్నారు. సంభాషణ తిరిగి తిరిగి పెళ్లిలో మంగళహారతి పళ్లెం మీదికి వచ్చింది.

"ఏదయినా, మీకున్న గడుసుతనం మాకు లేదు" అంది తులసెమ్మ.

"ఏంచేత?" అని తెలియగోరింది వియ్యపురాలు.

"లగ్గంనాటి మంగళహారతి పళ్లెంలో పాతికరూపాయల డబ్బులేనా చేరలేదని మాపిల్లగోల పెట్టింది" అంది తులసెమ్మ.

"పోనీ, మీపిల్లకి ఇయ్యకుండా మీరే తీసుకోలేక పోయేరా?" అంది వియ్యపురాలు.

"అయితే ఇహ ఆడపడుచుకి ఏమీ ఇయ్యనక్కరలేదంటారేమిటి?" అంది తులసెమ్మ కూతురు.

"ఇయ్యవద్దని చెప్పడంలేదమ్మా. లగ్గంనాటి మంగళహారతి పళ్లెం ఆడపడుచుకే విధిగా ఇయ్యాలని ఆచారంలేదుకదా!" అంది వియ్యపురాలు.

"సదస్యంనాడు మంగళహారతి పళ్లెంలో మేము వేసింది చూడండి! ముప్పై పడవేశాము. మీలెక్కని వేస్తే ఇరవైతో సరిపుచ్చవలసిందే!" అంది తులసెమ్మ!

"అంతే చెయ్యలేక పోయేరా" అంది వియ్యపురాలు.

"ఒకరు చెప్పుకొరికితే, ఒకరు సిద్ధి కొరుకుతారా?" అంది తులసెమ్మ.

(26-వ పేజీ చూడుడు)

# అతివృష్టి

(15-వ పేజీ తరువాయి)

"ఇక్కడ చెప్పకోరకవలసిన పనీలేదు, సిద్ధికోరకవలసినపని అంతకన్నా లేదు" అంది వియ్యపురాలు.

"ఏమిమాట చమత్కారమమ్మా" అంది సింగమ్మ.

"ఆడపెళ్ళివారికేమి తెలుస్తాయి. ఎప్పటికేనా మా చెయ్యికిందే!" అంది బంగారమ్మ.

"అంతా అమాయికత్వమే! నోట్లో వేలు పెడితే కరవలేరు, వెన్న పెడితే మింగలేరు!" అంది సింగమ్మ.

"ఇదిగో! అమ్మాయీ! నువ్వు చిన్నపిల్లవి! నీకెందుకు ఊరుకో. పెద్దవాళ్ల మాట్లలు నీకెందుకు! నీ ఈడుపిల్లలు అన్నిటిలోను కలిగించుకుంటే ఎలాగు!" అంది వియ్యపురాలు.

"ఇప్పుడు మంగళహారతి పళ్ళెంలో తక్కువయితే ఎవరు నష్టపోయేరు!" అని అడిగింది సింగమ్మ.

"నాకు అక్కరలేదని మీ అమ్మగారికే విడిచిపెట్టలేకపోయేవు?" అంది వియ్యపురాలు.

"అదీ మీసలహా! బాగానే ఉంది! మళ్ళీ ఇక్కడ అక్కడా కూడా మేమే నష్టపోతాము! మీ బదులు మేము ఇచ్చుకుంటాము!" అంది తులసెమ్మ.

"ఏమో ఒక దాంట్లో ఎక్కువవుతుంది. ఒకదాంట్లో తక్కువవుతుంది. అన్నీ చూచి సరిపుచ్చుతారా ఎక్కడేనా? మీరు చేయించిన మంగళసూత్రం చిన్నది, మేము చేయించినది పెద్దది ఎవరిఇంటి ఆనవాయితీ వాళ్లది. దానికేం చేస్తాం చెప్పండి!" అంది బంగారమ్మ.

"ఎవరు చేయిస్తే ఏమిటి అది వచ్చేది మా అబ్బాయికేకదా! మా చేతితో మేము పెట్టుకొన్నా కూడే, పెట్టుకోకపోయినా కూడే!" అంది తులసెమ్మ.

"అంచేతే పెట్టుకున్నారు కాదే మనకెం?" అంది బంగారమ్మ.

"ఎవరుచెప్పినట్లుగా మేము చేసేమని, మీరు చెప్పినట్లుగా చెయ్యడానికి" అంది సింగమ్మ.

"అదికాదమ్మా! ఎక్కువ తక్కువ సంగతికి నేను, చెప్పాను. కాని నేను చెప్పినట్లు మీరుచెయ్యండి, అని చెప్పడం లేదు" అంది వియ్యపురాలు.

"అమ్మా! వియ్యపురాలు వచ్చిందని మన్నాపన చెయ్యక ఈ రాద్ధాంతమంతా ఎందుకమ్మా!" అంది సింగమ్మ వెటకారంగా.

"మీరు ఎన్ని అడిగినా, నేను ఎన్ని సమాధానం చెప్పినా ఈఒక్కపూటేకదా!" అంది బంగారమ్మ.

"సరి! బాగానే ఉంది! అడగడమే తప్పవచ్చిందా ఏమిటి! ఇహ అడగంలెండి, నాలుగు రోజులుండి మరీ వెళ్లుదురుగాని" అంది సింగమ్మ.

"నాలుగు రోజులుంటే అక్కడి పనులేమవుతాయమ్మా?" అని "ఇంతకీ మీ పిల్లని మీ ఇంట దిగపెట్టడం ముఖ్యంగాని మా ఉండడానికేమివచ్చె!" అంది వియ్యపురాలు.

"ఉండకపోతే ఎవరికివట్టం, ఎవరికి ఉద్ధరింపు!" అంది తులసెమ్మ.

అదే నేను అనడమున్నా!" అంది బంగారమ్మ.

భోజనాలు పూర్తిఅయి ఎవరిదారిని వారులేచి తమతమ పనులు చేసుకొన్నారు.

రామామణి తల్లి ఆ మన్నాడే రాజోలుకి ప్రయాణమయింది. వెళ్లేముందు కూతురితో "నీ దగ్గరఉన్న కార్డులు, కవరువాకేసి అప్పుడప్పుడు నీ క్షేమ సమాచారాలు రాస్తూండు" అని చాటుగా చెప్పింది.

బంగారమ్మ రాజోలు చేరుకొన్నాక జరిగిన సంభాషణంతా బలభద్రంతో చెప్పింది.

"అన్నా! మంగళహారతి నేరమొకటి మనమీద వచ్చిందా? పోనీ ఒక పదిరూపాయలనోటు ఆడపడుచు చేతిలో పెట్టిరాలేకపోయేవూ?" అన్నాడు బలభద్రం.

"అలాగు పుచ్చుకొంటారేమిటి?" అంది భార్య.

"సరే! ఈ కూతురు వెళ్లేటప్పుడు చీరఒకటికొని ఆ అమ్మాయికి ఇస్తే సరిపోతుంది" అన్నాడు బలభద్రం.

సాయంత్రంపూట తులసెమ్మ దేవాలయంలో పురాణం వినడానికి వెళ్లింది. సింగమ్మ ఆల్లికసూదితో దారంఅల్లుకొంటూంది. రామామణి బియ్యం ముందు పోసుకొని వడ్లు, బెడ్డలు ఏరుతూంది.

"మరింత చలిమిడి తేలేకపోయేవుటో. ఓవిడా!" అంది సింగమ్మ.

"ఏమో! మా అమ్మ అంతే ఇచ్చింది" అంది రామామణి.

"సారె మరింత తెస్తే ఏమిటి పోతుందనో! నువ్వూ, నీ మొగుడూ తింటారు కాని ఎవరకేనా కావాలా ఏమేనా!" అంది సింగమ్మ.

"ఏమో మా అమ్మ అంతే ఇచ్చింది. ఈ మాటు మాఇంటికి వెళ్లినప్పుడు మరింత ఇమ్మంటాను" అంది రామామణి.

"అప్పుడే మీ ఊరికి పంపిస్తారని అనుకొంటున్నావు కామోసు పాపం! ముద్దరాలివి!" అంది సింగమ్మ.

"ఎప్పటికీ ఇక్కడే ఉంచేస్తారేమిటి" అని అడిగింది రామామణి అమాయికంగా.

"మరి అత్తవారిల్లంటే ఏమిటనుకొంటున్నావు?" అంది సింగమ్మ.

"కొన్నాళ్లయేక మా అమ్మకి ఉత్తరం రాస్తానులెమ్మని" అంది రామామణి.

"నువ్వెంతటి దానివేనా అగుపవమ్మ చదువుకొన్న దానివి, ఉత్తరాలు రాయిస్తావు, పత్తరాలు రాస్తావు!" అంది సింగమ్మ.

"మా నాన్న క్లీడరుగుమాస్తా పని చెయ్యడంలేదు, పత్తరాలు రాయడానికి" అంది రామామణి.

"అదంతా మా మీద వెటకారం కామోసు. అదీ తప్పేవచ్చిందీ?" అంది ఆడపడుచు.

"తప్పని చెప్పడం లేదమ్మా! నాకు రాదని చెప్తున్నాను" అంది రామామణి.

"ఎన్నిటికైనా సమర్థురాలివి! కప్పని కరిపించాగలవు, పాముని విడిపించాగలవు!" అంది సింగమ్మ.

"ఏమో, అదంతా నువ్వే చెప్పాలి" అంది రామామణి.

"మావన్నీ మాటలు, మీవన్నీ పనులు. పైకి మాత్రం ఏమీఎరగనట్టు కనపడతావు" అంది ఆడపడుచు.

ఇంతటిలో తల్లి వచ్చింది. చెన్నారావు కూడా వచ్చాడు. జరిగిన సంభాషణంతా సింగమ్మ వాళ్లిద్దరితోను చెప్పింది. "అలాగ ఉంది దానిపొగరు!" అంది తులసెమ్మ. ★

శ్రీమద్భగవద్గీత
వ్యాఖ్యాత: శ్రీ కాశీనాథుని నాగేశ్వరరావు
ఆరవ ముద్రణము : వెల రూ 4-0-0
(ప్యాకింగు, పోస్టేజి రూ 0-9-0)
ఆంధ్రగ్రంథమాల.

# అతివృష్టి

## పెద్దకథ

శ్రీ టేకుమళ్ల కామేశ్వరరావు

(క్రిందటి వారం తరువాయి)

## 2

తులసెమ్మ ప్రతిక్షణం కోడలిమీద ఏదో నేరంకని పెట్టి, దెప్పిపొడుస్తూనే ఉంటుంది. ఆడపడుచు సూదిపోటు మాటలంటూనే ఉంటుంది.

పొరుగింటిఅమ్మాయి ఒకర్తె 'మా ఇంటికి ఒకమాటు రావమ్మా! మా ఇంటికి ఒకమాటు రావమ్మా!' అని పోరుపెట్టగా రామామణి వాళ్ల ఇంటికి ఒకమాటువెళ్లి కొంతసేపు కూర్చుని, మాట్లాడి వచ్చింది.

"ఎక్కడికి వెళ్లావు?" అని అత్తగారు నిలవతీసి అడిగింది.

"ఎవరినడిగి గుమ్మంకదిలేవు?" అంది ఆడపడుచు.

"ఏమిటో, అమ్మి 'రా అమ్మా! రా అమ్మా' అని పిలుస్తూంటే ఒకమాటు వెళ్లాను" అంది కోడలు.

"ఇవాళ వాళ్లరమ్మంటే వెళ్లావు, రేపు మరొకరు రమ్మంటారు. అప్పుడేం చేస్తావు?" అంది తులసెమ్మ.

"అంతా నీకే తెలుసు తెలుసును!" అంది ఆడపడుచు.

"స్వయంరాజా స్వయంమంత్రి" అని ఒరే! అబ్బాయ్! ఇలాగ ఒక్కమాటరా!" అని తులసెమ్మ కొడుకుని పిలిచింది.

"ఎందుకే అమ్మా!" అంటూ కొడుకు వచ్చాడు.

"చూశావా నీ పెళ్లాంచేసే పనులు?" అంది తులసెమ్మ.

"ఏమిటి జరిగింది, ఏమిటి?" అని ప్రశ్నించాడు కొడుకు.

"ఏముందేమిటి? ఎవ్వరూ పిల్వలేదోకాని, పిధులన్నీ పీకించి ఇప్పుడు ఇంటికి చేరుకొంది. తెలిసి ఇది మొదటిసారి. తెలియక ఎన్నోసార్లో!" అంది తల్లి.

"ఇదివరకు ఎన్నిసార్లు తిరిగి ఉండకపోతే అన్ని తెలుస్తుంది! ఇవాళ్టి ఇంటి వెనక్కు నువ్వాం, మనం ఏడుస్తూ వాళ్లని!" అంది ఆడపడుచు.

"చూడరా నాయనా! దీని వాలకం!" అంది తులసెమ్మ.

"చూస్తూనే ఉన్నానే అమ్మా!" అన్నాడు చెన్నారావు.

"ఇహ చెయ్యిచేసుకుంటే తీరేకాని ఇది లొంగేటట్టుంది కాదు. నేను ఎందుకుపోనీ ఒక అమ్మకన్న పిల్లని తెచ్చి ఇబ్బంది పెట్టడమని ఎంత ఓరిమిపడుతున్నా అంతకంతకి రెచ్చిపోతూంది" అంది తులసెమ్మ.

"ఇప్పుడు ఊరుకుంటే ఇంకా తాడు జారిపోతుంది" అంది ఆడపడుచు.

"మనమర్యాద నిలబెట్టుకునేటట్లు కనపడదురా నాయనా! వాళ్ల కుటుంబానికి మానాభిమానాలు ఉండటే లేవనుకో! ఆవిడగారు రాణీలాగవచ్చి ఒకపూట ఉండి ఠీవిగా దయచేసింది. వచ్చినపూటయినా ముళ్లమీద నిల్చున్నట్లుగా నిల్చుంది. ఆవిడగారికెంత రాయసం! ఓహో! ఆ ఒక్కపూట కూడా ఉండకపోతే ఏ దేవుడు చెప్పేడు! ఆవిడగారి కుమారిరత్నం ఆవిడగారు!" అంది అత్తగారు.

"అదంతా నేను కనిపెడుతూనే ఉన్నాను" అన్నాడు కొడుకు.

రామామణి పెరటిలో ఏదోపనిచేసుకోడానికి అక్కణ్ణించి వెళ్లిపోయింది.

మరొకరోజున సన్నిధిరావు ఏవో కోర్టు కాగితాలు చూసుకొంటూ సావిట్లో కూర్చున్నాడు.

తులసెమ్మ "ఏమండోయ్!" అంది.

"ఏమిటే?" అంటూ సన్నిధిరావు వచ్చాడు.

"మీరు నాకో క్రొత్త పింఛనిప్పించాలి" అంది భార్య.

"అప్పుడే పింఛనేమిటే! జీతమందుతూ పోయినవాళ్లు పుచ్చుకుంటారు కాని ఎక్కడేనా! నేను పుచ్చుకున్నానా చెప్పు?" అన్నాడు భర్త, భార్యభావం గ్రహించలేక.

"ఈ ఘటానికి శాశ్వతపింఛనితోగాని మధ్య మరెవరూ అక్కరలేదనా మీ ఊహ?" అంది తులసెమ్మ.

"అజ్జే! అదికాదే! నేను చెప్పడమేమిటంటే? నువ్వుకాకపోతే ఇంటిపెత్తనం ఎవరుచూస్తారు? కోడలు చిన్నపిల్లకదా ఇంకా" అన్నాడు సన్నిధిరావు.

"అదికాదండీ నేనుచెప్పడం. పొయ్యి దగ్గరనుంచి కొంత—"

"సరి! సరి! ఇంకా ఏమిటో అనుకున్నాను. ఇంకా అంత ఆలోచనపోలేదు నాకు" అని సన్నిధిరావు క్షమాపణగొంతుక పెట్టాడు.

"చివరకి ఒక్కపూటకూడా నావల్ల కాకుండా వచ్చింది!" అంది భార్య.

"కోడలు వచ్చేదాకానే అని ఇదివరకే ఒప్పందం అయిందిగా!" అన్నాడు సన్నిధిరావు, ఆవిడ మాటలుసమర్థిస్తూ.

"ఆవిషయమయ్యే మీకు మళ్లీ దరఖాస్తు పెట్టుకోడం! స్వామీ బహుపరాక్! అని" అంది తులసెమ్మ.

"దానికి ఒకరినడగాలిటే" అని వేళా... సన్నిధిరావు.

"ఉన్నమాటలు మనవిచేసుకున్నా. అంతేకాని మరేం లేదు" అంది తులసెమ్మ.

"ఇదిగో! రెండుపూటలూ దానిచేతే చేయించు" అన్నాడు సన్నిధిరావు.

"లేకపోతే దానిమదం అణిగేదారికనబడదు. దిమ్మచెక్కలాగు తిని కూర్చుంటే పొగరుబలిసిపోతూంది" అంది తులసెమ్మ.

"ఈరోజే మంచిరోజని రెండుపూటలూ వంట కోడలికి అప్పజెప్పాను" అంది తులసెమ్మ.

సన్నిధిరావు "బాగుంది" అన్నాడు. చెన్నారావు సంతోషించాడు.

మరొకరోజున పొద్దుగుంకుతూండగా తులసెమ్మ "ఓహో! అదేం కబుర్లు! అదే సరసాలు! మా కాలంలో ఎరగమమ్మా ఈ విడ్డూరాలు!" అంది.

సన్నిధిరావు వింటూనే ఉన్నాడు. రామామణి లాంతర్లు, దీపాలుతుడుస్తూండి కొడుకు అక్కడే నిలబడిఉన్నాడు.

"అదేం వాలాఖా నీరూ తెలియకుండా ఉంది. ఒకటే గుసగుసలు! ఎవరినిగురించో ఏమిటో!" అంది తులసెమ్మ.

"ఉత్తి పోసికోలుకబుర్లేనే! వద్దే అంటే మానదే! అన్నాడు కొడుకు వినుకొంటూ.

"వినబడని మాటతో చెప్పి ఊరుకుంటున్నాడు! చూడండి అబ్బాయి ఎంత తెలివైనవాడో! కుక్కకాటుకి చెప్పుదెబ్బ అన్నసామెత ఉండనేఉందికదా! నీ చేతకాకపోతే నేనుకూడా వాజమ్మలా చూస్తూ ఊరుకుంటాననుకుంటున్నా...

కామోసు! పేరుప్రతిష్ఠలు పోయేక చేసేది ఏమీ లేదు. దీపమున్నప్పుడే ఇల్లుచక్కబెట్టుకోమని శాస్త్రం" అంది తులసెమ్మ.

"లేకపోతే అదికాస్తా ఆరిపోయేక ఎవరిదారి వాళ్ళది" అన్నాడు సన్నిధిరావు.

"పోనీ ఎప్పటికేనా కొస్త జ్ఞానం వస్తుందేమో అని చూస్తున్నాను! 'అత్తగారు' అని మన్నాపన సరేలేదుకదా, అసలు పిలవడమే అరుదయిపోయింది. ఇహ మన్నాపనగౌరవ ఏమివచ్చె!" అంది తులసెమ్మ.

"మనం ఎవరమన్నా కోపమే నే! ఎప్పుడూ పీకవరకు ఉంటుంది అదేం పాపమోగాని!" అంది కూతురు, తనచేతితో తన పీకపట్టుకొని అభినయిస్తూ.

"చెప్పకుండా రాత్రుళ్లు కాస్తకాళ్లు పిసుకుతుందేమోఅని వచ్చినప్పటినుంచి చూస్తున్నాను!" అంది అత్తగారు.

"పీక పిసకకుండాఉంటే కాళ్లు పిసికినంతఫలం!" అందికూతురు.

"ఆ! అన్నిటికీ తెగించినదేలే!" అంది అత్తగారు.

"అంతపనీ చేసే మనిషే!" అంది సింగమ్మ.

"సరే! మొదట చెప్పి చూడు!" అన్నాడు సన్నిధిరావు.

"చెయ్యకపోతే తడిపిడిలగ్గం తాతకిపెళ్లి జరగనే జరుగుతుంది!" అంది కూతురు.

"ఈ రోజు లగాయతు రాత్రి పదిగంటలదాకా నన్నడగందే నీ మొగుడితో మాట్లాడకూడదు! ఏమి విన్నావా?" అంది అత్తగారు.

"ఊఁ" అంది రామామణి.

"నోరు ఏమయిపోయింది. నోట ఇప్పుడు కబుర్లు రావేమో!" అంది అత్తగారు పేళనగా.

"అలాగేదో నిష్కర్షగా చెప్పిచూడు. అంతేగాని ఉత్తమాటలెందుకు ఊపిరిదండగ" అన్నాడు సన్నిధిరావు.

"పోనీ పిల్లకదా దానికదేబుద్ధి తెచ్చుకుంటుందేమోఅని నేనూ చూస్తున్నాను!" అన్నాడు కొడుకు.

"పిల్ల! పాపం చిన్నకూచి! ఇంకా తల్లిపాలు విడవలేదు!" అంది సింగమ్మ.

వంటింటిలో పని పాట్లకి పోయింది రామామణి. మరి కాస్తసేపు ఆ అమ్మాయిని గురించే మాట్లాడుకొని సభ చాలించారు.

ఇంకొకరోజున సన్నిధిరావు డిస్ట్రిక్టు కోర్టుకి పనిమీద వెళ్లాడు. కొడుకు ఇన్‌స్టిట్యూట్‌కి చదువుకి వెళ్లాడు. రామామణి వంటఇంటిలో గిన్నెలు తోముతూండగా అత్తగారు, ఆడపడుచు వచ్చారు.

"ఇంకా నీకు ఎప్పుడు తెలుస్తుంది. ఆచారంగా చెయ్యాలని. ఈజన్మలో తెలుస్తుందా?" అంటూ అత్తగారు, కోడలి బుగ్గలు పట్టుకొంది.

"ఇహ తెలియడమే! పుల్లలతో తెలియవలసిందే!" అంది ఆడపడుచు.

"ఏమీ! ... నోటమాటరాదేం!" అంది అత్తగారు.

"తోముతున్నాను" అని జవాబు చెప్పింది కోడలు.

"నాకు కళ్లుపోయేయనుకున్నావేమిటి! నీ ఖర్మమా అంటూ ఇంకా అంతమట్టుకు రాలేదు!" అంది తులసెమ్మ.

"చూడు దాని పొగరుబోతుతనం!" అంది సింగమ్మ.

"ఒళ్లు వాయగొడతాను. ఇంకా నా సంగతి ఎరగవు!" అంది తులసెమ్మ.

"ఎలా చూస్తుందో చూడమ్మా!" అంది సింగమ్మ.

"చూస్తుంది! చూడకేం! దీని గుడ్లుమూడ! ఇది ఎవర్నెలనుకొంటూందో!" ఏమిటో! అంది అత్తగారు.

"నువ్వు మెత్తమెత్తగా ఊరుకుంటూంటే ఇది దాని ఇత్తే!" అంది కూతురు.

రామామణి మళ్లీ పనికి కూర్చోబోగా చేతిలో చెంబు జారికింద పడింది.

"అయ్యయ్యయ్యో! చెంబు పగిలిపోయింది. ముక్కలయిపోయింది!" అంది తులసెమ్మ.

"చూడు దాని గీర్వాణం" అంది సింగమ్మ.

దీని గీర్వాణం వదిల్చేస్తా అంటూ!" తులసెమ్మ చీపురుకట్టతీసికొని కోడలిని రెండు బాదింది.

రామామణి గుడ్లనీరు కుక్కుకుంది.

"వచ్చినట్లు నోరుమూసుకో! నోరు ఎత్తేవంటే వెలక్కాయి పెచ్చులలాగు దవడలు నొక్కేస్తా!" అంది అత్తగారు.

"ఊరుకొంటుందనుకున్నావు పాపం! నీ తెలివితక్కువగాని!" అంది సింగమ్మ.

"ఊరుకోక ఏమిచేస్తానమ్మా!" అంది రామామణి.

"నామీదకూడా తిరగబడుతున్నా! నేను మా అత్తగారిని కాదు ముద్దియ్యడానికి! ఆడపడుచుని" అంటూ సింగమ్మ రామామణి బుగ్గలు పొడిచింది.

"ఇహ నీ అంతం చూస్తాను, ఈ మోస్తరుగా చేసేవంటే!" అని కోడలి వీపుమీద రెండు వేసింది అత్తగారు.

"ఎందుకూ మొగుడితో చెప్పేతేసరి!" అంది కూతురు.

"వాడో చవటపీనుగ! కాబట్టే దీని ఆటలు ఇలాగు సాగుతున్నాయి. వాడే చేతనయినవాడైతే నాకీ ఖర్మమేమి పట్టిందమ్మా. కొట్టికొట్టి చేతులు కాళ్లు నొప్పులు పెట్టి నేను ఏడుస్తూంటే!" అంది అత్తగారు.

"ఎవరిదారిని వారు వెళ్లిపోయేరు.

సాయంత్రం చెన్నారావు ఇంటికి వచ్చేటప్పటికి రామామణి తలకి గుడ్డకట్టుకొని పని చేసుకొంటూంది. కొడుకురాగానే అన్ని విషయాలూ చెప్పింది తల్లి. అతను "అందుకనా! సరిసరి! ఏమిటోఅనుకున్నాను! రోగంవచ్చినట్లు నటన! పాపం ఎవరేనావచ్చి బతిమాలుకొంటారనుకుంది కాబోలు! అంత వెర్రివాళ్లు ఈ కొంపలో లేరన్న సంగతి ఇంకా ఎరగదు పాపం!" అన్నాడు. ఇంతటిలో సన్నిధిరావు వచ్చాడు. సంగతిఅంతా తెలుసుకొని కోడలిమీద నాలుగు కేకలు వేశాడు. రామామణికి దిక్కుతోచలేదు. ఉన్నసంగతి సందర్భాలన్నీ చాటుగా కాగితంమీదరాసి పోస్టుకవరులో పెట్టి పొరుగింటి స్నేహితురాలికి అందియ్యగా, ఆ అమ్మాయి పోస్టు పెట్టెలో పడవేసింది.

ఒకరోజు మధ్యాహ్నం పని అంతా చేసుకొని తీరుబాటుగా సావిటిలో కూర్చుంది బంగారమ్మ. పక్కనే వాలుకుర్చీమీద వాలాడు బలభద్రం.

"ఇల్లంతా చిన్నపోయింది పిల్ల వెళ్లిపోయేక!" అంది భార్య.

"ఆ! అలాగే ఉంది!" అన్నాడు బలభద్రం.

"కిందటిమాటు పిల్లరాసిన ఉత్తరమే ఎంతసేపూ నాకు తలపుకి వస్తూంటుంది" అంది భార్య.

"ఉత్తరం ఏమీ విశదంగా లేదు." అని వ్యాఖ్యానించాడు భర్త.

"అంతా ఓర్చుకొంటూ, సంగతులు దాస్తూన్నట్టుగా కనబడుతూంది నాకు" అంది బంగారమ్మ.

ఆమె అభిప్రాయంతో ఏకీభవిస్తూన్నట్లుగా ఊరుకొన్నాడు బలభద్రం.

"పోనీ ఒకమాటు బయులుదేరి వెళ్లివద్దామంటే వర్షాలొకటి! ఎడతెరిపిలేకుండా తినివేస్తున్నాయి! అష్టకష్టాల ప్రయాణం!" అంది భార్య.

"పనిఉంటే వర్షమని మానుకొంటావేమిటి!" అన్నాడు భర్త.

"ఇదెక్కడి వర్షాలోనమ్మా! ఏమీతోచనియ్యకుండా చస్తున్నాం! ప్రాణం ఎంతయినా ఎండకి ఓరుస్తుంది కాని వానకి ఓర్చదు" అని బంగారమ్మ అంటూండగా

వీధి గుమ్మంలో పోస్టుమాను నిలబడ్డాడు. బలభద్రం తొందరగావెళ్లి సంచీ ఉత్తరం అందుకొన్నాడు. చింపి, ఉత్తరంతీసి "అమ్మాయిదగ్గరనుంచి" అన్నాడు.

వినడానికి తల్లి తొందరపడింది.

బలభద్రం ఇలాగు చదివేడు" మహాలక్ష్మీ సమానురాలైన మా అమ్మగారికి, నాన్న గారికి నమస్కారములు. అక్కడి క్షేమ సమాచారములు తెలియపరచవలెను. ఇక్కడి నా యోగక్షేమములనుగురించి వేరేరాయనక్కరలేదు. మా అత్తగారు ఆడపడుచు నన్ను ఇల్లు కదలనివ్వకుండా ఉన్నారు. ఇంటిలో పనివాళ్లు చెయ్యడమే మానివేశారు. ఏమిపొరపాటువచ్చినా అత్త గారు ఆడపడుచు నన్ను కొడుతున్నారు. మా మామగారు, మీ అల్లుడుగారుకూడ వాళ్లపక్షమే! వాళ్లకి తెలియకుండా ఈ ఉత్తరం రాసేటప్పటికి బ్రహ్మాండమైపో యింది. పక్క ఇంటిలోనున్న ఒక స్నేహితు రాలిని ఈ ఉత్తరం పోస్టులో పడవెయ్య మన్నాను. నాకు దారితెన్ను కనబడడం లేదు. మీ మొహాలు ఇక నేను చూస్తానో చూడనో! ఇట్లు మీకుమార్తె రామామణి."

ఉత్తరంచూసి తల్లిదండ్రులు కొయ్య అయిపోయారు. కొంతసేపటికి గాని తండ్రి నోటమాటరాలేదు. తల్లి గుడ్లనీరు గుక్కు కుంటూ కూర్చుంది.

"ఇక మళ్లీ మీ మొహాలు చూస్తానో చూడనో అని రాసింది బిడ్డ!" అని బల భద్రం కన్నీళ్లు కార్చాడు.

"బతకనిస్తారో బతకనియ్యరో ఆఖరికి!" అంది తల్లి కళ్లు తుడుచుకొంటూ.

"ఇంతమట్టుకు వస్తుందనికలలోకూడా అనుకోలేదు" అన్నాడు తండ్రి.

"తులసెమ్మ సంగతి ఎరిగిన వాళ్లందరూ అలాగే చెప్తారు!" అందిబంగారమ్మ.

"మనఖర్మం కొద్దీ వచ్చింది ఈ సంబంధం! కాకపోతే మాణిక్యంలాంటి పిల్లని తీసుకువెళ్లి వాళ్లయదాన్ని పెట్టడమే మివచ్చె!" అన్నాడుభద్ర.

"లేక లేక బిడ్డకలగడమేమిటి! మనకీ ప్రాలుద్ధమేమిటి!" అంది తల్లి.

బలభద్రం కళ్లనీళ్లు పెట్టుకొని ఆలోచిస్తు న్నాడు.

"ఇంటిదగ్గిర పనివాళ్లని మానిపించేశారని రాసింది బిడ్డ! ఇంటి చాకిరీఅంతా దాని చేతే చేయిస్తున్నారేమోఖర్మం!" అంది బంగారమ్మ.

"ఇంటిలోపని అత్తగారు, ఆడపడుచు ముట్టుకోడం మానివేసి అంతా పిల్లచేతే చేయిస్తున్నారని దాని అర్థమనుకొంటాను" అన్నాడు బలభద్రం.

"ఏమో, తులసెమ్మ ఎంతకేనా తగును!" అంది భార్య.

"ఏమిటిదారి!" అన్నాడు బలభద్రం.

"గోదావరేదారి!" అంది భార్య.

"అలాగ అధైర్యపడిపోతే ఎలాగే! ఏదో అన్నిదోవలూ తొక్కిచూడాలి!" అన్నాడు బలభద్రం.

బంగారమ్మకి ఏడుపేగాని ఆలోచన తోచలేదు.

"తొందరపడి గంగులం చేసినంత మాత్రాన్ని

వ్యవహారాలు చక్కబడతాయా ఏమిటి!" అని అతను ఒక్క పిసరు స్థిమితంగా ఆలో చించాడు.

"వియ్యంకుడిపేర ఒకఉత్తరం రాస్తాను. అల్లుడు మాయింటికివచ్చి చాలకాల మయింది. దసరాపండగలకి అల్లుడు అమ్మా యితో కూడ ఇక్కడికి వచ్చి నాలుగు రోజులుండి వెళ్లవలసింది అనికోరుతూ రాస్తాను" అన్నాడు బలభద్రం.

"వాళ్లు పంపవద్దూ!" అంది భార్య.

"అన్నీ మనమేప్రశ్నించుకొని మనమే కాదు అనుకొంటే ఇక దారేమిటి! కాబట్టి ఆమోస్తరుగా అడిగి సమాధానం ఏమివస్తుందో చూద్దాం!" అన్నాడు బల భద్రం.

"మనుష్యులనిబట్టి ఏమంటారో మొదటే చెప్పలేకో వచ్చుకదా!" అంది పెళ్లాం.

"సరే! ఆ ఉత్తరం ఆమోస్తరుగా రాసి మరొక పనిచేస్తాను" అన్నాడు బల భద్రం.

బంగారమ్మ ఆసక్తితో చూసింది.

"మా స్నేహితుడి ఇల్లు మనవాళ్ల ఇంటికి దగ్గరలోనే ఉంది. అమ్మాయి పెళ్లికి వచ్చాడు. శోభనాచలం అన్న పేరు వింటూనే ఉన్నావు. నాకు బాగా స్నేహి తుడు. అతను ప్లీడరుపనిచేస్తున్నాడు రాజ మహేంద్రవరంలోనే! అతనినో లేక అతని వాళ్లనో పంపించి ఒకమాటు మనవాళ్ల ఇంటికివెళ్లి కాస్త యోగక్షేమాలు వాకబు చేసి రమ్మంటాను" అన్నాడు బలభద్రం.

"సరే!" అంది భార్య.

తాను చెప్పినప్రకారమే ఉత్తరాలు రాసిపడవేశాడు బలభద్రం. బిడ్డరాసిన వార్తవిన్నాక తలిదండ్రులమనస్సులు దిగు లుగా ఉన్నాయి.

ఒకరోజున రామామణిఇంటిలో మినప పిండి విసురుతూంది. సింగమ్మ దగ్గరకి వచ్చింది. ఊళ్లోకబురు ఏదో చెప్పుతుంది కామోను అనుకొంది రామామణి. కాని సింగమ్మ "మీ అమ్మకి- నాన్నకి ఒక్కపి సరేనా బుద్ధిలేదు" అంది.

"ఏమి?" అని అడిగింది రామామణి, పిండి విసరడం కాస్తసేపు కట్టిపెట్టి.

"ఎంతసేపూ తమపిల్ల సుఖపడాలి, తమ పిల్ల కాపరంచెయ్యాలి అని ఆలోచనలే కాని ఎదుటివాళ్ల సంగతిఅక్కరలేదమ్మా! స్వలాభపరులు! స్వశ్రేయోభిలాషులు! వాళ్ళకి పుట్టిన చుప్పనాతివి నువ్వు! ఒకళ్లు సుఖపడిపోతారేమో అని ఏడుస్తావు నువ్వు! పోనీఇన్నాళ్లయిందికదా! సింగమ్మకి ఈసం బంధంచూసేను. ఇంతింత కట్నాలు అడు గుతున్నారు. ఇది మీకు ఇష్టమా, అయిష్టమా

(20-వ పేజీ చూడండి)

SPLENDID SELECTION
MADE IN FAMOUS SWISS FACTORIES
EACH GTD. FIVE YEARS

NO-81

Size 7¾"
5 JEWELS CHROME 30/- ROLLED GOLD 33/-
7 JEWELS CHROME 35/- SUPERIOR 38/-
15 JEWELS " 44/- ROLLED GOLD 48/-

NO-82

Size 7¾"
5 JEWELS CHROME 28/- ROLLED GOLD 33/-
7 JEWELS CHRME 33/- SUPERIOR 35/-
15 JEWELS " 42/- ROLLED GOLD 45/-

NO-83

Size 12'''
FULLY JEWELLED 19/- SUPERIOR 21/-
WITH RADIUM 21/- CENTRE SECOND 23/-
SPECIAL HIGH CLASS MACHINE 27/-

NO 84

Size 8¾'''
5 JEWELS CHROME 26/- ROLLED GOLD 32/-
7 JEWELS CHROME 32/- ROLLED GOLD 36/-
15 JEWELS " 48/- ROLLED GOLD 58/-

NO-85

Size 6¾'''
5 JEWELS CHROME 22/- SUPERIOR 25/-
5 " ROLLED GOLD 30/- SUPIRIOR 33/-
15 " CHROME - 45/- ROLLED GOLD 55/-
TIME PIECE - 20/- SUPERIOR 25/-
POCKET WATCH 12/- SUPERIOR 15/-
Postage extra. Free on order for two
H. DAVID & CO.
POST BOX NO 11424 CALCUTTA

# అతివృష్టి

(14-వ పేజీ తరువాయి)

అని ఒక్క ఉత్తరంలోనేనా రాసేరేమో చూడు" అంది సింగమ్మ.

ఇంతటిలో తల్లి వచ్చింది.

చూడవే అమ్మా! దీని పుట్టింటివాళ్ల చుప్పనాతితనం! ఇదిగో మీపిల్లకి సంబంధాలు వాకబుచేస్తున్నామని ఒక్క ఉత్తరంలో నేనా రాసేరేమో చూడు!" అంది సింగమ్మ.

"అది అలాగుంచు. ఈఅష్టదరిద్రదేవత ఇంటికి వచ్చేక శనిపట్టుకొంది. పిల్లకి అంతకిముందు వచ్చే సంబంధాలుకూడా వెనక్కి పోయేయి. చయురుకాళ్ల మహాలక్ష్మి కొంపకిదాపురించేక ఏమవుతుంది! నేను ఈ ఇంటిలో అడుగుపెట్టేక వీళ్లకి ఎటువంటి ఐశ్వర్యంపట్టిందో చూడు. మా ఆడబిడ్డలకి, మరుదులకి అంతకిముందు పెళ్లిళ్లు లేవు. అటువంటిది నేను పాదంమోపేక అవన్నీ జరిగేయి. అంతకిముందు మీనాన్న పనిపాట్లు లేకుండా వీధులవెంబడి బలాదూరు దిరిగేవారు. అటువంటిది నేనువచ్చేక ఉద్యోగం వచ్చింది. ఈభోగమంతా వచ్చింది" అంది తులసెమ్మ.

"మాకి శనిగొట్టుదేవత ఎక్కడప్రవేశించిందోనమ్మా! అంది సింగమ్మ.

"ఇదిపాదంపెట్టేక ఇప్పుడు ఉన్నది ఊడ్చుకుపోకుండాను, మనం నలుగురమూ బతికి ఉన్నప్పుడూ చూసుకోందాంలే?" అంది తల్లి.

ఇంతటిలో వీధిలో "ఏమండోయి తులసెమ్మగారూ!" అంటూ పిలుపు వినవచ్చింది. తులసెమ్మ, సింగమ్మ వీధిగుమ్మం దగ్గరికి వెళ్లారు. లోపల రామామణి పిండి విసురుతూంది.

"క్షేమమా! శోభనాచలంగారి తాలూకువాళ్లం!" అంది శోభనాచలం భార్య.

"సరి! సరి! మీరా! ఏమిటి విశేషాలు! కూర్చోండి!" అని తులసెమ్మ అనగా, సింగమ్మ చాప వేసింది.

అందరూ సావిటిలో కూర్చున్నారు.

"కోడలు ఇంటిలోనే ఉందా?" అని అడిగింది శోభనాచలం భార్య.

"అబ్బే! ఇంటిలో ఎక్కడమ్మా! మా పెత్తల్లిని ఒకమాటు చూసివస్తానని ఇవాళే బయల్దేరి వెళ్లింది. పెత్తండ్రే వచ్చి నాలుగురోజులు ఇక్కడఉండి పిల్లని మరీతీసుకువెళ్లాడు. అక్కడినుంచి పుట్టింటికి కూడా ఒకమాటు వెళ్లిరమ్మన్నాం. అటుతల్లి రాకయేక ఇటుకోడలు వెళ్లకపోయేక ఇహ ఎలాగు! చిన్నపిల్లకదా! అంచేత వెళ్లాళ్ల ఈమధ్యరాదు" అంది తులసెమ్మ.

"ఈ ఇంటిలోఅంతా ఆవిడఇష్టమేకాని మాఇష్టమేమీ లేదమ్మా!" అంది సింగమ్మ.

"మరి మీతర్వాత కోడలిదేకదా పెత్తనమంతా! అంచేత ఇప్పటినుంచీ తరిఫీదు ఇయ్యకపోతే ఎలాగు! అత్తకొలం అంత్యకాలం, కోడలికాలం కొంతకాలం అని సామెత కదా!" అంది శోభనాచలంభార్య.

"అబ్బే! ఇహ మాకాలమంతా అయిపోయింది. ఏదో ఒకమూల 'రామ, కృష్ణ' అనుకొంటూ పడిఉండడం, పిలిచినప్పుడు వేళకివెళ్లి నాలుగుమెతుకులు గొంతుకలో పడవేసుకొని మళ్లీవచ్చి మూలకూర్చోవడం! ఇంతకంటే మేము చెయ్యవలసింది ఏముంది చెప్పండి? ఓపికఉన్నన్నాళ్లు పాటుపడ్డాం చాలదూ! దీనికి అంతెక్కడ!" అంది తులసెమ్మ.

"మీకేమండి మహరాజులు! పెట్టిపుట్టారు! ఇంటిభారం మెడమీద లేకపోయేక మహదృష్టవంతులని వేరే చెప్పేదేమిటి!" అంది శోభనాచలంభార్య.

"ఇహ ఇలాగు కాలంవెళ్లబుచ్చుకుంటే చాలదూ!" అంది తులసెమ్మ.

"ఇల్లుమీ సొంతమేకదూ?" అని "సావిడి బాగానే ఉంది! పెరటిలో ఎవరో పని చేసుకొంటూన్నట్లుగా ఉన్నారు" అంది శోభనాచలంభార్య.

"దాసీది ఏదోపని చేస్తూంది" అంది తులసెమ్మ.

"బాగానేఉంది ఇల్లు! చక్కగా పెట్టెలాగు ఉంది!" అంది శోభనాచలంభార్య. ఇంటిలోకివచ్చి చూడండి ఒ మాటు అని తులసెమ్మ అంటుందేమో ఒకమాటు ఇల్లంతా చూద్దామనుకొంది. కాని తులసెమ్మ అనకపోగా ఆవిడకూడా ఊరుకొంది. మరికొంతసేపు పిచ్చాపాటి మాట్లాడి "వెళ్లివస్తానమ్మా! ఎప్పుడేనా తీరుబాటు చేసుకొని మాఇంటికి ఒకమాటు రండి" అని ఆహ్వానించగా "ఎంతమాట?" అని జవాబు చెప్పింది తులసెమ్మ. శోభనాచలం భార్య వెళ్లిపోతుంది. ★

(ఇంకా వుంది)


## రు. 100 బహుమానం

(గవర్నమెంటు రిజిష్టర్డు)

తెల్ల వెంట్రుకలను అంత మొందించండి రంగులు వాడకండి. మా ఆయుర్వేద సువాసన "సెంట్రల్ మోహిని ఆయిల్" 60 ఏళ్లదాకా నల్లగా ఉంచును. ఇది మీ దృష్టిని వృద్ధిపరచి తల నొప్పిని కుదుర్చుతుంది. కొన్ని వెంట్రుకలు తెల్లబడితే రూ. 2-8-0 తో ఒక సీసా (మూడు ఒకసారి 6-8-0) కొనండి. హెచ్చుగ తెల్లబడితే 3-8-0 (మూడు ఒకసారి 9-0-0.) తలంతా తెల్లబడితే రు. 5-0-0 (మూడు ఒకసారి రు. 12) కొనండి. ఇది అబద్ధమని ఋజువుచేసిన వారికి రు. 100 బహుమానం. పూర్తి వివరాలకు అణాన్నర స్టాంపు పంపి గ్యారంటీ తీసుకొనండి

**Bharat Kalyan Aushadhalaya.**
Post Bag No 6725, Calcutta. (A P).


"మనం పెళ్లాడాం గనక నీలోని కొన్ని లోపాలు తెలుపుతాను ?"

"ఎందుకు? నే నాలోపా లెరుగుదును. వాటిమూలంగా నేను మీతో సరిపెట్టుకోవలసి వచ్చింది."

* * * *

కండక్టరు: (ప్రయాణీకుడితో) ఆ పెట్టె దారి కడ్డం పెట్టారు. వచ్చేపోయ్యేవాళ్లు పడగలరు. పక్కగా పెట్టండి.

ప్రయాణీకుడు: అక్కడే ఉండనీ. ఎవరో ఒకరు పడుతూ ఉండకపోతే దాని సంగతే జ్ఞాపకం ఉండదు నాకు.

# అతివృష్టి

## పెద్దకథ — శ్రీ టేకుమళ్ల కామేశ్వరరావు

(క్రిందటివారం తరువాయి)

### 3

కొమార్తె విషయమై బలభద్రం, బంగారమ్మ తల్లడిల్లిపోతున్నారు. భోజనాలై సావిటిలో వాళ్లిద్దరూ కూర్చున్నారు.

"ఈఏడు వర్షాలు అధికమై పంటలు నాశనమైపోయాయి"అన్నాడు బలభద్రం.

"అతివృష్టి అనావృష్టికూడా ఫలితంలో సమానమే!" అంది భార్య.

ఇంతటిలో పోస్టుమాను గుమ్మంలో ఎదురయాడు. బలభద్రం వెళ్లి లేఖ అందుకొన్నాడు. ఉత్తరం చూసి 'శోభనాచలం దగ్గరనుంచి వచ్చింది' అని, చదువుకొని, భార్యతో "మన అమ్మాయి ఆమె పింతల్లిగారింటికి వెళ్లిందని రాశాడు. ఈ పింతల్లి ఎవరు? మనవైపు పింతల్లు లెవరూ లేరుకదా! ఒక వేళ అల్లుడి పింతల్లిగారింటికి అల్లుడు అమ్మాయి వెళ్లేరేమో! కాని అక్కడినుంచి పుట్టింటికి వెళుతుందని చెప్పడం చూస్తే ఈమాటలేఅర్థంకాకుండా పోతున్నాయి" అన్నాడు బలభద్రం.

"ఏదయినా పిల్ల సంగతి ఇదమిత్థం అని తేలలేదు" అంది బంగారమ్మ.

ఇద్దరికీ ఏమీ పాలుపోలేదు. దిగులుగానే కూర్చున్నారు. వియ్యంకుడిదగ్గరనుంచి ఉత్తరంకోసం అనుక్షణం చూస్తూనే ఉన్నారు.

ఆ మర్నాడు సన్నిధిరావు రాసిన ఉత్తరంచేరింది. బలభద్రం చదివి, భార్యతో "అమ్మాయి ఖులాసాగానే ఉందిట!" అన్నాడు. ఆ మాట విని భార్య "అమ్మయ్యా!" అని గుండెలమీంచి భారం తీసినట్టుగా కనబడింది.

"ఈదసరా సెలవులకి వాళ్ల పింతల్లిగారింటికి కొడుకు కోడలు వెళతారుట! బహుశ! ఈసంగతే కామోసు శోభనాచలం తల్లకిందులుగా రాశాడు. ఇంతకీ వాళ్లకేమి పట్టింది చెప్పా! అతని భార్య వెళ్లి కనుక్కొంటిట! ఒకరి పని మరొకరు చెయ్యడం వస్తే ఇలాగే ఉంటుందనుకో" అని నవ్వి "పైగా, ఆమెకి ఈచుట్టరికాలన్నీ సరిగా తెలియక తబ్బిబ్బు పడినా పడుండవచ్చు!" అని వ్యాఖ్యానం చేసి, సర్దుబాటు చేశాడు.

అప్పటి కేదో కొత్త శాంతి అనిపించింది వాళ్ల మనస్సులకి.

ఆ మర్నాడు రామామణిదగ్గరనుంచి ఉత్తరం వచ్చింది. తల్లిదండ్రు లిద్దరూ ఉత్తేజం పొందారు. తండ్రి ఆ ఉత్తరం విప్పి చదివిచూసుకొని నిర్ఘాంతపోయాడు. అతని మొహంచూసి భార్య అదుర్దాపడి "ఏమి టేమిటి!" అని ప్రశ్నించి "పిల్ల ఖులాసాగా ఉందో లేదో మొదట చెప్పండి!" అని గాబరాపడింది.

బలభద్రం కళ్ళ నీళ్లు తుడుచుకొంటూ ఉత్తరం ఇలాగు చదివాడు. "శ్రీమహాలక్ష్మి సమానురాలైన అమ్మగారికి — నేను ఇక్కడ బాధలు పడలేకుండా ఉన్నాను. పోనీ ఓపిక తెచ్చుకొని చాకిరీ చేద్దామా అంటే ఓపిక సన్నగిలింది. శల్యావశిష్టంగా ఉన్నాను. చిన్ననాడు ఉపాధ్యాయుడు నేర్పిన అక్షరం ముక్కలు నాకు ఇంత అక్కరకి వస్తాయని నేను కలలోనైనా తలచలేదు. నా క్షేమ సమాచారాలు మీకు తెలియజేసేవారు ఎవరిక్కడ? మనుష్యులకి నన్ను చూడడానికి సాధ్యంకాదు. అటువంటి చెర అనుభవిస్తున్నాను. ఈ మధ్య నాయోగక్షేమాలు తెలుసుకోడానికి ఎవరో ప్లీడరుగారి భార్య వచ్చిందట! కాని నేను మా పింతల్లిగారింటికి వెళ్లినానని చెప్పిమా అత్తగారు పంపించి వేసినారట! ఈ సంగతి నాకు నా పొరుగింటి స్నేహితురాలివల్ల తెలిసింది. ఆ అమ్మాయే నా ఉత్తరాలు పోస్టులో పడవేస్తూ ఉంటుంది. ఇంతకంటే రాయవలసిన విశేషాలు లేవు. ఎంతో రహస్యంగా ఈ ఉత్తరంరాయడమే కష్టమైపోయింది. ఇహ నాదగ్గర కార్డులు, కవర్లు లేవు. మీ మొహాలుచూసే అదృష్టం దేవుడు నాకు రాసి పెట్టేడో లేదో!" అని చదివి బలభద్రం కళ్లనిచేతితో కప్పుకొన్నాడు. అతని చెక్కిళ్లవెంబడి కన్నీళ్లు ప్రవహిస్తున్నాయి.

బంగారమ్మ వల వల ఏడ్చింది.

"శోభనాచలం రాసిన విషయం ఈ ఉత్తరంతో కాని రుజువుకాలేదు. "పాపం! అతన్ని నిష్కారణంగా దూషించాను"అని బలభద్రం పశ్చాత్తాపపడ్డాడు.

"వాళ్లు పెట్టే ఖాయిదాకి మితం కనబడడంలేదు. పిల్ల బతికినప్పటి మాట!" అంది భార్య.

"అల్లుడు తన పింతల్లిగారింటికి వెళతాడని సన్నిధిరావు రాసిన సంగతి ఉత్తమోసమని ఈ ఉత్తరంవల్ల బైటపడింది" అన్నాడు బలభద్రకం.

"వాళ్లు ఎంతకైనా తెగించిన మనుష్యులు! మన ఖర్మం ఇలాగు కాలిపోతుందనుకోలేదు!" అని మళ్లీ ఏడ్చి "ఒకమారు బయలుదేరివెళ్లి సొంతంగా సంగతులు తెలుసుకు వచ్చేవరకూ నా మనస్సులో మనస్సు ఉండదు" అంది బంగారమ్మ.

"నేను ఒక్కణ్ణే కాకుండా ఇద్దరం బయలుదేరివెళ్లి చూసివద్దాం"అన్నాడుభర్త.

"ఇద్దరంవచ్చి ఇంటిమీద పడ్డామని ఏడుస్తుందేమో వియ్యపురాలిముండ!"అంది బంగారమ్మ.

"ఏడవనీ, మృతవనీ, మొత్తుకోనీ! తప్పుతుందా ఏమిటి అవసరం వచ్చినపుడు అని "ఉత్తరం మొదట రాయకుండా వెళ్లడం పెద్దమనిషితరహా కాదు. కాబట్టి వియ్యంకుడికి 'ఇలాగు వస్తాము' అని ఒక లేఖ రాసి పడవేస్తాను. దానికి జవాబువస్తే సరి! లేకపోతే బయలుదేరి వెళ్లడం ఎలాగూ తప్పదు!" అన్నాడు బలభద్రం.

"అది జవాబు రాయనిస్తుందా, ఆ తులసెమ్మముండ!" అంది బంగారమ్మ.

"రాయనియ్యకపోయినా మనం వెళ్లడం తప్పదుగా!", అన్నాడు భర్త.

"శోభనాచలంగారికి కూడా ఒకటి రాసి పడవెయ్యండి" అంది బంగారమ్మ.

"ఔను! ఔను! అదిమంచి ఆలోచనే."

'ఇలాగు ఇలాగు త్వరలో వస్తున్నాం. వచ్చినప్పుడుమిమ్మల్ని కలుసుకొంటాం. మీరు మాపిల్ల యోగక్షేమాలు తెలియబరచినందుకు అనేక వందనాలు' అంటూ ఒక లేఖ అతనికి కూడా రాసిపడవేస్తాను" అన్నాడు బలభద్రం.

ఆ మోస్తరుగానే అతను ఉత్తరాలు రాసిపోస్టులో పడవేశాడు.

స్నేహితుడి దగ్గరనుంచి వచ్చిన ఉత్తరం చూసుకొన్నాడు శోభనాచలం. "మీరు ఈ ఊరికి వచ్చినప్పుడు తప్పకుండామా

ఇంటి దగ్గిర రెండురోజులు ఉండి మా ఆతిథ్యాన్ని స్వీకరించి, మా ఉభయుల్నీ ఆనందింపజేయవలసింది" అంటూ జవాబు రాశాడు.

శోభనాచలం రాసిన ఉత్తరం అందగా బలభద్రమూ, బంగారమ్మా పొంగిపోయేరు.

బలభద్రం రాసిన లేఖ సన్నిధిరావుకి అందింది. రామామణీమినహాగా తక్కిన నలుగురూ సావిటిలో చేరి మంత్రాంగం జరిపారు.

"ఇక్కడ సంగతులన్నీ కొన్ని కొన్ని ఏదో మోస్తరుగా అవతలకి పాక్కుతున్నాయి" అంది తులసెమ్మ.

"ఈ లేఖమోస్తరే వేరుగా ఉంది. వెనకటి లేఖలలాగు లేదు. మనం అల్లుడు, కూతురూ ఊళ్లో ఉండరు అని రాసినా కూడా తాను ఇక్కడికి వస్తానని రాయడం చూస్తే నీవు చెప్పిన సంశయం బలపడుతూంది" అన్నాడు సన్నిధిరావు.

"కాని ఇంతకుముందు ఏ సంగతీ తెలిసినట్టుగా కనపడదు" అంది సింగమ్మ.

"ఇప్పటికైనా కొన్ని కొన్నే గాని అన్నీ తెలిసినట్టుగా లేదు" అన్నాడు చెన్నారావు.

"సరే! ఇవన్నీ ఎవరి ద్వారా తెలిసేనో మనకి అంతుపట్టడంలేదు!" అన్నాడు సన్నిధిరావు.

"ఏమో ఆ మధ్య శోభనాచలంగారి భార్య మన ఇంటికి ఒకమారు వచ్చి 'మీ కోడలు లేదా' అని అడిగింది. అప్పుడు నా కేమీ తోచనే లేదు. ఇందుకే నేమో మన ఇంటికి వచ్చింది!" అంది తులసెమ్మ.

"బహుశః! ఇందుకే అయివుంటుంది" అంది సింగమ్మ.

"పోనీ ఎవరిద్వారా వెళ్లేనో కనిపెట్టేరా?" అన్నాడు సన్నిధిరావు.

"ఏమో నాకేమీ అంతుపట్టడంలేదు" అంది తులసెమ్మ.

"మనం తగినంత ఉషారుగా ఉండడం లేదన్న సంగతి రుజువయింది!" అంది సింగమ్మ.

"ఇహముందేనా కాస్త జాగ్రత్తగా ఉండండి!" అన్నాడు తండ్రి.

"సరే ఇప్పటి మాటేమిటి?" అన్నాడు కొడుకు.

"అదే నేను అనవచ్చేదీ!" అంది తల్లి.

"ఎలాగ జవాబు రాయాలి అని ప్రశ్న" అంది సింగమ్మ.

"ఎలాగ వాళ్లు రాకతప్పదు!" అన్నాడు సన్నిధిరావు చేతిని కదిలించి.

"వస్తే, ఇది ఊరుకుంటుందా! వాళ్లని ఇంట్లోకి రానిస్తే ఉన్న గుట్టుమట్టు వెల్లడిచేసి వాళ్లముందర ఏడవడమూ! మన మర్యాద ఏం నిలబెడుతుందని!" అంది తల్లి.

"ఇహ అదంతా ఉత్తమాట!" అన్నాడు ప్లీడరుగుమస్తా.

"అసలు ఇంటికి రాకుండా చేసేస్తే!" అంది సింగమ్మ.

"అమ్మాయి ఆలోచన బాగుంది" అని తల్లి మెచ్చుకొంది.

"బాగానే ఉంది! పులిని పట్టుకొని కోరలు, గోళ్లు లాగేస్తే మంచిది అన్న ఉపాయంలాగే ఉంది. వాళ్లని రాకుండా చెయ్యడ మెలాగు?" అని ప్రశ్నించాడు సన్నిధిరావు.

"మా ఇంటికి రావద్దని రాసేస్తే" అంది సింగమ్మ.

"అదే, ఎలాగు అని నేనడగడం?" అన్నాడు తండ్రి.

"ఏదో ఒక చిలిపి తగవు తెచ్చి, వచ్చిన వాళ్లని తోలివేస్తే" అంది సింగమ్మ.

"ఇంకా ఆ ఆలోచన బాగా ఉంది" అన్నాడు సన్నిధిరావు.

"పోనీ ఆ తగవు ఉత్తరంలోనే తెచ్చి మీరు మాకొంపకి రావద్దని రాసేస్తే!" అంది తులసెమ్మ.

"ఇది భేషైన ఆలోచన! ఇది వెండికి బంగారపు పూతపూసినట్లుంది." అన్నాడు సన్నిధిరావు.

"బృహస్పతిలాంటి ఆలోచన!" అన్నాడు కొడుకు.

"ఇహ నెందుకు! కాస్త అందించేరు కదా. తక్కినది నేనే చేసుకుపోతాను. 'మీరు పెళ్లిలోను, అటుతర్వాత మమ్మల్ని పెట్టిన ఇబ్బందులవల్ల, అమర్యాదలవల్ల, మీ రెప్పుడూ మా గుమ్మంతొక్కవద్దంటూ గట్టిగా రాసేస్తాను" అన్నాడు సన్నిధిరావు.

"మనం రాసినా కూడా వాళ్లు చొరవచేసి వస్తే ఏమి చేస్తారు?" అని ప్రశ్నించింది సింగమ్మ, బుర్ర నిలువుగా ఆడిస్తూ.

"ఇంటిలో మీ అల్లుడు, కూతురు లేరంటూ చెప్పి, తగవులాట పెట్టి పంపించివేద్దాం. రావద్దంటే వచ్చినందుకు ఎవరమూ పలకరించ నేవద్దు. పరాభవం జరిగిపోతుంది అదెంత పని అనీ!" అంది తులసెమ్మ.

పై ఆలోచనల ప్రకారమే బలభద్రానికి ఉత్తరం తయారుచేద్దామని సన్నిధిరావు లేచాడు. సింగమ్మ పెరటివైపు వెళ్లింది.

రామామణి ఇంటిగోడ కన్నంలోంచి పొరుగింటిపిల్లతో మాట్లాడుతుండగా చూసింది సింగమ్మ. తుర్రున ఇంటిలోకి వచ్చి అందరితోనూ చెప్పింది. అందరూ పెరటిలోకి వెళ్లారు. ఇంతటిలో రామామణి వచ్చి నిల్చుండగా "అక్కడ ఏమి చేస్తున్నావు?" అని ప్రశ్నించింది అత్తగారు.

"అవతలనుంచి వాళ్లపిల్ల అందరూ కులాసాగా ఉన్నారా?" అని అడిగింది. 'ఊఁ' అన్నాను. అంతే" అంది రామామణి.

"మాసేవుట్రా అబ్బాయీ!" అంది తల్లి.

"అదంతా ఈ ద్వారానే జరిగి ఉంటుంది" అని తండ్రి గుర్తుగా అన్నాడు.

"ఏమో చెప్పలేము!" అన్నాడు కొడుకు.

సందేహ మెందుకు?" అంది సింగమ్మ.

"ఇంత ఘనమైన కోడలు దొరికింది మనకు!" అంది తులసెమ్మ.

"అబ్బాయి శక్తి యుక్తులు ఇంతగా ఉన్నాయి!" అన్నాడు తండ్రి.

"వాడు వట్టి వాజమ్మ కాబట్టే దాని ఆటలు సాగుతున్నాయి!" అంది తల్లి.

చెన్నారావుకి పెళ్లాంమీద కోపం వచ్చింది. రెండు చరిచి కిందికి గెంటివేశాడు. రామామణి కిందికి పడిపోయి మొర్రోమంటూ ఉండగా, నోరు నొక్కి రెండు అణిచింది అత్తగారు. ఆడపడుచు బుగ్గలు చిదిమింది. నోటికి వచ్చినట్లు అందరూ తిట్టేరు.

గోడకన్నానికి రాళ్లు కూరాడు సన్నిధిరావు.

సన్నిధిరావు తమమీద నేరాలు మోపుతూ, మా ఇంటికి రావద్దంటూ రాసిన లేఖ బలభద్రానికి చేరింది. అతను చదువుకొన్నాడు. భార్యకి తెలియజేశాడు. ఇద్దరూ నిర్ఘాంతపోయి కూర్చున్నారు.

"పిల్లని మన కళ్లఎదట పెట్టదలచుకోలేదు వాళ్లు" అంది బంగారమ్మ విచారంతో.

'వ్యవహారం ఇంతవరకు ముదిరిపోతుందని కలలో నేనా అనుకోలేదు" అన్నాడు బలభద్రం.

"మన నుదుట రాసిన రాత ఇలాగుంది" అంది భార్య.

"తగవులాట, అల్లరికంటె దారికనబడడం లేదు" అని బలభద్రం విచారించాడు.

వారు ఉభయులు ఆలోచనచేసి రాజమహేంద్రవరానికి బయలుదేరి వెళ్లి, శోభనాచలంగారి ఇంటిలో మకాంచేసి, వ్యవహారం జరపదలుచుకొన్నారు.

బలభద్రం, బంగారమ్మ వచ్చి శోభనాచలంగారింటిలో మకాం చెయ్యగా శోభనాచలం [illegible] దంప[illegible]

లిద్దరూ వియ్యాలవారింటికి వెళ్లారు. కాని అక్కడ ఆలనపాలన కనపడలేదు. 'మీ అల్లుడు, అమ్మాయి వాళ్ల పింతల్లిగారింటికి వెళ్లారు' అన్నమాట మట్టుకు ఇంటిలోంచి వినవచ్చింది. కాని అది ఉత్తమాట అని బలభద్రం భావించుకొన్నాడు.

ఒకరిద్దరి మధ్యవర్తులచేత బలభద్రం తన వియ్యాలవారికి కబురు చేశాడు. వారివల్ల 'మీ ఆస్తిఅంతా మీ అల్లుడిపేర రాస్తే మీ అల్లుడు ఎప్పటికేనా మీతో మాట్లాడతానని చెప్పాడు' అని కబురొకటి అదనంగా తెలియవచ్చింది. అది వట్టి అబద్ధం అని బలభద్రం తలచాడు.

పిమ్మట బలభద్రం సన్నిధిరావు ఇంటి పక్కనిఉన్న రామామణి స్నేహితురాలింటికి భార్యాసహితంగా వెళ్లాడు. వాళ్లు ఎంతో మర్యాద చేశారు.

బలభద్రం "ఇదివరకు మీ అమ్మాయి మా అమ్మాయికి చేసిన సాయానికి మేము ఉభయులం చాల సంతోషిస్తున్నాం. మా కృతజ్ఞతకి మేరలేదు" అంటూ తీసుకొని వెళ్లిన పేమానులు ఆ అమ్మాయి తండ్రికి అందించాడు. ఆ అమ్మాయి తల్లితండ్రులు చాల సంతోషించారు.

తండ్రి "మాకూ, సన్నిధిరావు కుటుంబానికీ చాల ఏళ్లుగా మాటలు లేవు. ఆ తులశమ్మకి ఎవరితో సరిపడుతుంది. మేము వాళ్ల పొరుగన ఉండడమే వాళ్లకి జగడానికి కారణం. ఎల్లో నారాయణమ్మలాగు ఉంటానంటుంది తులశమ్మ. మీ అమ్మాయితో మా పిల్ల మాట్లాడుతూందని తెలిసి కాబోలు మాకూ వాళ్లకీ మధ్యనున్న గోడ కన్నంలో రాళ్లు కుక్కేశారు. కాబట్టి మేము కొత్తగా చెయ్యగలిగిన సాయమేమీ ఉన్నట్లుగా కనబడదు" అని విచారించాడు.

"మీరు వెనక చేసిన సాయానికే మా కృతజ్ఞతలు!" దంపతులిద్దరూ ఒకేమారు అన్నారు.

"ఏవిధంగానైనా మా పిల్లని మా ఇంటికి తీసుకు పొండి!" అన్నాడు ఇంటాయన.

"పిల్ల, అల్లుడు ఇంటిలోనే ఉన్నారా?" అని అడిగాడు బలభద్రం.

"లేకేమి! రోజూ ఏవో మాటలు, కొట్లో, తిట్లో వినపడుతూనే ఉంటాయి!" అన్నాడు ఇంటి యజమాని.

"ఇంటిలో లేరని ఉత్తరం రాశాడు మా వియ్యంకుడు" అన్నాడు బలభద్రం.

"అవన్నీ ఉట్టిమాటలు! తులశమ్మ ఏమి చెప్పితే మొగుడది చేస్తాడు. కాబట్టి మీరు ఆ మాటలు నమ్మనక్కరలేదు. మీ అల్లుడు ఇంటిలో ఉన్నమాటమట్టుకు నిజం" అన్నాడు ఇంటాయన.

"ఎలాగయినా మా పిల్లని ఇవతలకి తీసుకువచ్చే మార్గం మీరే చూడాలి. మీకంతే నాపుణ్యం ఉంటుంది" అని బలభద్రం అన్నాడు.

దంపతులిద్దరు ఇంటిఅతన్ని కాళ్లు, కడుపు పట్టుకొని బతిమాలుకొన్నారు.

"అది ఎలాగు సాధ్యమవుతుంది అబ్బా!" అని ఇంటి అతను ఆలోచించాడు.

అతనికొడుకు ఒక ఉపాయం చెప్పాడు. "వాళ్ల ఇంటికి మన ఇంటికి మధ్యనున్న గోడపక్కనే ఒక జామిచెట్టు ఉందికదా. ఆ చెట్టుకి ఒక పెద్ద గోనె పట్టా వేలాడ కడదాం. చెట్టుకి ఆన్చి ఒక నిచ్చెనవేసి, చెట్టుపంగాలు కొమ్మమీద నిల్చుని చూస్తే వాళ్ల పెరట్లో జరిగే విచిత్రాలన్నీ చక్కగా కనబడతాయి."

ఈ ఉపాయం అందరికీ నచ్చింది. ఆ పనిని చెయ్యడం ఆ అబ్బాయికే విడిచిపెట్టారు. అతను ఆ మోస్తరుగానే గోనె పట్టా కట్టేడు. అతను చూస్తూండగా రామామణి పెరటిలోకివచ్చి, అంట్ల గిన్నెలు ముందు పడవేసుకొని తోముతూంది. అతను వేగిరం దిగివచ్చి, బలభద్రాన్ని త్వరగా రమ్మని సైగ చేసి నిచ్చెనసాయంతో చెట్టెక్కి చూడమనగా, అతను అలాగు చేశాడు. రామామణిపోల్చి లేకుండా చిక్కిపోయి, చింకినుడ్డకట్టుకొని, అంట్లు పరపర తోముతూండగా బలభద్రం చూసి భరించలేక కిందికి దిగి ఏడ్చేడు. సంగతి తెలుసుకుని బంగారమ్మ వెక్కి వెక్కి ఏడ్చింది.

ఇంటివారి అబ్బాయి మళ్లీ చెట్టెక్కి చూశాడు. కాని రామామణి పని ముగించుకొని ఇంటిలోకి వెళ్లిపోయింది. అతను దిగి లోపలకి వచ్చివేశాడు.

"మీరు ఊళ్లోకి వచ్చినట్లుగా మీ అమ్మాయికి తెలిసినట్టుగా లేదు" అన్నాడు ఇంటి యజమాని.

"అయుండవచ్చు" అన్నాడు బలభద్రం.

"ఈ విషయంలో మీ అమ్మాయే మాకు దారి చూపించాలి" అంది బంగారమ్మ.

"అది ఏలాగు సాధ్యమవుతుందో!" అన్నాడు ఇంటాయన.

"మొదట అమ్మాయికి చెట్టు ఎక్కడం నేర్పాలి" అన్నాడు అబ్బాయి.

"అదెంతపని తర్వాత?" అని అడిగేడు తండ్రి.

"ఉత్తరం ఒకటి రాసి రాతికి చుట్టబెట్టి అమ్మాయి చేతికి ఇచ్చి, రామామణికి విసరమని చెప్పాలి" అన్నాడు అబ్బాయి.

'ఈ ఆలోచన బాగుందంటే' బాగుం' దనుకొన్నారు.

ఆ ప్రకారమే అమ్మాయికి తరిఫీదు ఇవ్వదలచుకొన్నారు.

"ఆ తర్వాత చెయ్యవలసిన పనేమిటి?" అని అడిగాడు ఇంటాయన.

"మీరు ఉత్తరం రాసి ఇవ్వండి. ఆమోస్తరుగా పంపుదాం" అని అబ్బాయి బలభద్రాన్ని అడిగాడు.

"అది మంచి పని కాదు. మేము రాసిన ఉత్తరం మా వియ్యంకుడిచేతిలో పడితే ప్రమాదం. మేము వచ్చినట్లు, చేసినట్లు మీ అమ్మాయే ఉత్తరం రాసిపంపడం మంచిది. మీ అమ్మాయి పేరుఊరు లేకుండా రాసిన లేఖ ఒకవేళ ఇతరుల చేతులలో పడినా ప్రమాదంలేదు" అన్నాడు బలభద్రం.

"లేఖ ఒకళ్ల చేతులలోపడకుండా మేము తంటాలు పడతాం" అన్నాడు అబ్బాయి.

"మొదట మీరు రాసి సంగతులు కనుక్కోండి" అన్నాడు బలభద్రం.

ఆరోజుకి బలభద్రం, అతని భార్య అక్కడినుండి వెళ్లలేక మకాంకి వెళ్లిపోయేరు.

మరునాటి పొద్దున్న ఇంటివారి అబ్బాయి ఒక లేఖ తయారుచేశాడు. అమ్మాయి చెట్టెక్కడం నేర్చుకొంది. ఆ అమ్మాయి చెట్టుమీదే కాచుకు కూర్చుని, రామామణి ఇవతలకి వచ్చిన వేళకి, రాతికి చుట్టబెట్టిన ఉత్తరం విసరగా రామమణి తన స్నేహితురాలిని చూసి, సంతోషించి, కిందనుండి ఉండని తీసి, ఉత్తరం విప్పి, గబగబా చదువుకొంది. మళ్లీ ఆ ఉత్తరం ఆ రాతికే చుట్టి విసరివేయవలసిందని ఆ లేఖలో ఉండడంచేత, ఆ అమ్మాయి అలాగే వెనక్కి విసిరివేయగా, ఇంటివారి అమ్మాయి తీసుకొంది. రామామణి తన తలిదండ్రులు ఊళ్లోకి వచ్చేరని తెలుసుకొని సంతోషించి, వాళ్లని చూడలేకపోయినందుకు ఏడుస్తూ ఇంటిలోకి వెళ్లిపోయింది.

మధ్యాహ్నము బలభద్రమూ, భార్యా స్నేహితురాలి ఇంటికిరాగా, జరిగిన సంగతంతా వాళ్లకి ఇంటిఆయన తెలియజేశాడు. వాళ్లు ఒకవైపు సంతోషిస్తూ, మరొకవైపు ఏడ్చారు. మళ్లీ కిందటిరోజులాగే బలభద్రం చెట్టెక్కి, పిల్లని చూసి, బ్రహ్మానందసముద్రంతోపాటు, దుఃఖసముద్రంలో కూడా మునిగిపోయాడు.

అందరూ సావిటిలో చేరి "దీని తర్వాతి ఎత్తు ఏమిటి?" అని ఆలోచించారు.

"పిల్ల ఎలాగో ఇవతలపడితే మా ఊరికి

మేఘాలమీద తీసుకు పోతాం" అన్నాడు బలభద్రం చిటికెలు వేస్తూ.

"సరే! ఆవిషయమై ఒక లేఖని తయారు చేద్దాం. మళ్లీ అదీ ఎప్పటిలాగే రాతికి చుట్టబెట్టి విసురుదాం" అన్నాడు అబ్బాయి.

"మీరు ఏదో వేళకి జట్కా బండీతో పెరటి గుమ్మందగ్గర సిద్ధంగా ఉండండి. ఆ అమ్మాయి తలుపు తీసుకొని ఇవతలకి వచ్చిన వెంటనే, జట్కా బండీమీద కూర్చోబెట్టుకొని తీసుకుపోయి, తర్వాత సంగతి తర్వాత ఆలోచించండి" అన్నాడు ఇంటాయన.

'ఈ ఆలోచన బాగుందంటే బాగుం' దని అందరూ ఆమోదించారు. దాని విషయమై ఒక లేఖ అబ్బాయి తయారు చేసి, అందరికి వినిపించగా, బాగుందని మెచ్చుకొన్నారు. ఆ ఇంటివారు తనకి ఇన్ని విధాలుగా సహాయపడుతూండగా తన కృతజ్ఞత ఏమోస్తరుగా చూపించాలో తోచక బలభద్రం అశ్రువులు రాల్చాడు.

ఆ మరునాడే జట్కాలో సామానులన్నీ పెట్టుకొని బండీవాడితో 'నీవు అడిగినంతా ఇస్తాము, బండీ మావశంలో ఉంచాలి' అన్నాడు బలభద్రం. వాడు ఒప్పుకొన్నాడు. ఆ బండీ రామామణి స్నేహితురాలి ఇంటి పెరటిగుమ్మానికి కొంచెం పక్కగా నిలబెట్టారు.

జామిచెట్టుమీదికి ఎక్కి, తెరవనక మంచి కని పెట్టుకొని చూస్తూంది రామామణి స్నేహితురాలు. రామామణి పెరటిలోకి వచ్చి, అంట్లు అన్నీ ఇవతల పడవేసి, ఊరికే జామిచెట్టు వైపు చూసింది. చెట్టుమీది స్నేహితురాలు ఉత్తరం విసిరింది. ఆ అమ్మాయి అది తీసి గబగబ చదువుకొంది. ఇది నిజమో అబద్ధమో తెలుసుకోడానికి పెరటి తలుపుతీసి బయటికి వచ్చింది. ఇంతటిలో సంగతులు తెలుసుకొని, బలభద్రం బంగారమ్మ, పెరటి తలుపు తీసుకొని వీధిలోకి వెళ్లారు. ఒకళ్లనొకళ్లు చూసుకొని మొహాలకి గుడ్డలు అడ్డు వేసుకొని, దుఃఖిస్తూండగా, 'ఇది ఏడ్పులకి సమయంకాదు' అని బలభద్రం, రామామణిని జట్కాబండిలోకి ఎక్కించాడు. తెరలు దింపివేశారు. అందరూ కలిసి పడవల రేవు చేరుకొని, అప్పుడే బయలుదేరుతూన్న రాధారీపడవ నందుకొన్నారు.

రామామణి వికృతవేషం చూసి భరించలేకపోయేరు. ఏబ్రాసిగుడ్డ విప్పించివేటిలో పారవేయించారు. మంచిచీర రవిక ధరింపజేశారు. తల్లితలదువ్వి జడవేసి, మొహం కడిగి బొట్టుకాటుక పెట్టింది. అప్పుడు కాని ఆమెతో మాట్లాడలేకపోయేరు.

రామామణి ఇంటిలోనే ఏదో పనిచేసుకొంటూందని ఇంటిలోవాళ్లు తలచారు. కాని బొత్తిగా జాడ కనబడకపోగా తులసెమ్మ కోడలిని పిలిచింది. కాని ఎక్కడా ఉలుకు పలుకు లేదు. అందరూ ఇంటిలో చూశారు, పెరటిలో చూశారు, నుయ్యి చూశారు. పెరటి తలుపుతీసి ఉండడం చూసి వీధిలోకి ఎక్కడికి వెళ్లింది చెప్మా!' అనుకొంటూ వెతికారు. ఎక్కడా కనబడలేదు! శోభనాచలంగారి ఇంటికి ఒక అతను వెళ్లి "బలభద్రంగారు ఉన్నారా?" అని అడగగా, వాళ్లు 'మా ఇంటిలో ఎవ్వరూ లేరు' అని సమాధానం చెప్పారు. చివరికి రామామణి వాళ్ల పుట్టింటికి పారిపోయి ఉంటుందని ఊహించుకొని, ఆ సంగతి ధ్రువపరుచుకోవడానికి మనిషిని ఒకణ్ణి రాజోలు పంపదలచుకొన్నారు.

ఆ మర్నాడు చెన్నారావు స్నేహితుణ్ణి ఒకణ్ణి 'సంగతులు తెలుసుకొని రావలసింది' అంటూ రాజోలు పంపించాడు. అతను వెళ్లి కనుక్కొని, తిరిగివచ్చి'

"మీకోడలు రాజోలులో ఖులాసాగా ఉంది" అని చెప్పగా "ఎలాగ చేరిందో!" అని అందరూ ఆశ్చర్యపోయారు.

తన ప్లీడరుద్వారానే సన్నిధిరావు 'ఇలాగు ఇలాగు మాకోడలిని పుట్టింటివారు బలత్కారంచేసి తీసుకుపోయేరు; కాబట్టి తిరిగి మాకు అమ్మాయిని అప్పజెప్పవలసింది' అని కోర్టులో వ్యాజ్యం వేశాడు.

కోర్టువారివద్దనుంచి వచ్చిన సమ్మన్లు బలభద్రం అందుకొన్నాడు. కథ మరొకదారి పట్టినందుకు విచారించాడు. విషయమంతా భార్య తెలుసుకొంది. ఆమె "ఇప్పుడు విచారించవలసినపని ఎంతమాత్రం లేదు. సంబంధం మొదట తెచ్చుకొన్నప్పుడే విచారించి ఉండవలసింది. ఒకదాని ఫలితమే మరొకటి. నలుగురి నోళ్లలో నానే పడ్డాం. ఇప్పుడు వెనక్కి తగ్గితే వచ్చే లాభం లేకపోగా నష్టం ఉండవచ్చు" అని సలహా చెప్పింది.

"భగవంతుడు కల్పిస్తూన్న పాట్లకి విచారిస్తున్నాను" అన్నాడు బలభద్రం.

"మనం చేసుకొన్న ఖర్మం ఇలాగుండగా భగవంతు డేమి చేస్తాడు!" అంది భార్య.

తమవైపు వకీలుగా శోభనాచలాన్ని ఏర్పాటు చేశారు. కేసు విచారణ అయ్యే రోజుకి బలభద్రం అతని కుటుంబం రాజమహేంద్రవరం చేరుకొన్నారు. కోర్టులో ప్లీడర్లు బల్లగుద్ది వాదించారు. వియ్యంకులు తిట్టుకొన్నారు. కాగితాలు, ఉత్తరాలు దాఖలు చేశారు. కాని బలభద్రం చెప్పినవి ఏవీ రుజువు కాలేదు. అందుచేత జడ్జిగారు రామామణిని ఆమె అత్తవారింటికి అప్పగించవలసిందని అంటూ తీర్పు చెప్పాడు.

రామామణితల్లిదండ్రులు విచారంతో కుంగిపోయారు. 'లోకంలో ధర్మమంటూ ఎక్కడా లేదు' అన్నాడు బలభద్రం. 'ఇది కలికాలం. ధర్మం ఒక్కపాదం మీదే నడుస్తూందిట!' అంది బంగారమ్మ. విధిలేక కోర్టువారి తీర్పుప్రకారం రామామణిని అత్తవారివశం చేశారు.

కథ మళ్ళీ ఎప్పటిలాగే తయారయింది. 'పిల్ల బతికే ఎత్తు కనబడదు!' అని బలభద్రం, బంగారమ్మ చాలా దుఃఖించారు. 'అన్యాయానికే గాని న్యాయానికి దారిలే' దంటూ బలభద్రం విచారించి, ఎప్పటి ఆశే ఆడదలుచుకొన్నాడు.

రామామణిని అత్తవారు మునపటి కంటె ఎక్కువగా కొట్టి తిట్టి హింసిస్తున్నారు. ఖాయిదా అధికంచేశారు.

మళ్ళీ మునపటిలాగే బలభద్రం భార్యతో కూడా శోభనాచలంగారి ఇంటిలో బస చేసేడు. రహస్యంగా రామామణి స్నేహితురాలి కుటుంబంతో ఆలోచనలు జరిపేరు. రహస్యంగా వెనకటి ఆటే మొదలు పెట్టారు.

రామామణితో సంప్రదింపులు రహస్యంగా జరిపేరు. బలభద్రం డబ్బుకి వెనక్కి తియ్యలేదు. అంతా వెనకటి ఆటే ఆడి రామామణిని తిరిగి తమ ఊరికి తీసుకుపోయేరు.

'ఎన్ని విధాలు కనిపెట్టినా, లాభం లేకపోయింద'ని తులసెమ్మ కుటుంబం విచారించింది. ప్రతిమాటు కోర్టుకి ఎక్కడ ఎక్కుతాం,' డబ్బెక్కడ పోస్తాం? తతిమా పనులు పాడుచేసుకొని కోర్టువెంట ఎక్కడ తిరుగుతాం! పైగా ఇష్టంలేని కాపరం చేసేమి, మానేమి. ఎందుకు వచ్చిన రొష్టు ఇది మనకి? అని ఆ విషయం తలపెట్టడం మానివేశారు.

కుమారుడికి మరొక సంబంధం చూసింది తులసెమ్మ. మంచిరోజు చూసి ముడిపెట్టారు.

సమాప్తం

గనోక్యూర్
అన్ని సెగలకు గంటలలో గుణము
ఈశ్వర ఫార్మసీ, రాజమండ్రి.